GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ

GST IN - 36FDKPS 1308PZX

అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్

- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్

tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter

ప్రైవేట్ సంస్థలు, ప్రెస్‌క్లబ్‌లు, వ్యక్తులు దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం

దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :

8919710365 కు కాల్ చేయండి

సంపుటి : 6 | సంచిక : 321 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం 12-07-2024 | పేజీలు : 3

# పోడు రైతులకూ సాయం



### -ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**టి మీడియా, జూలై 11,ఆదిలాబాద్ :** క్షేత్రస్థాయిలో రైతుల నుండి అభిప్రాయాలు సేకరించి పూర్తిస్థాయి మార్గదర్శకాలతో 'రైతుభరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో రైతు భరోసా విధివిధానాల ఖరారుపై ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రైతుల నుండి అభిప్రాయాలు, సలహాలను క్యాబినెట్ సబ్ కమిటీ సేకరించింది. క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి దినసరి సీతక్క, శాసనసభ్యులు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో కీలకమైన రైతు భరోసా పథకాన్ని ప్రజాక్షేత్రంలో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేసి తీరుతుంది అన్నారు. అన్ని జిల్లాల్లో క్యాబినెట్ సబ్ కమిటీ పర్యటించి ప్రజా క్షేత్రం లో అభిప్రాయాలు సేకరించి ఈ అసెంబ్లీలో నివేదిక పొందుపరుస్తామని అన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం అందించే రైతు భరోసా పేద బడుగు వర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయని అన్నారు. రైతు భరోసా సాయం పై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు ఖరారు కాలేదని, గ్రామం యూనిట్గా తీసుకోవాలని రైతులు ఎక్కువమంది సూచిస్తున్నారని పేర్కొన్నారు. పోడు రైతులకు సర్కారు సాయంపై చర్చించి నిర్ణ నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

**10 ఎకరాల పరిమితి విధించండి..**

ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రాష్ట్ర ఆర్థిక భారం దృష్ట్యా పెద్ద రైతులకు పక్కనపెట్టి పేద, దళిత గిరిజన రైతులకు అందించాలని పలువురు రైతులు కోరారు. మెస్రం జంగు అనే గిరిజన రైతు మాట్లాడుతూ వర్షాధారంపైనే తాము పంట సాగు చేస్తున్నామని, ఖర్చులు పోను ఏమీ మిగడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా సగం వంతు, మిగిలిన సగం ఆర్థిక సాయం పట్టా రైతులకు అందించాలని అన్నారు. వెనుకబడిన అదిలాబాద్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పది ఎకరాల సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సర్కారు పంటల సాయం నిలుపుదల చేయాలని, రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు పనికిరాని బీడు భూములకు కూడా పంటల పెట్టుబడి సాయాన్ని ఆపివేయాలని ప్రకాష్, గుణవంతు, అనే రైతులు కోరారు .

**ప్రీమియం చెల్లించండి.. ఎమ్మెల్యే పాయల్ శంకర్**

రైతులకు విపత్తు సమయంలో పరిహారం అందించే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, రైతుల ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. బడా పారిశ్రామికవేత్తలకు, మూడు పంటలు సాగు చేసే పెద్ద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పది ఎకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేయాలని కోరారు.

**బడ్జెట్లో 20% నిధులు ఆదిలాబాద్ కు కేటాయించాలి.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**

వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేసి నష్టపోతున్నారని, ఈ జిల్లాకు ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ అమలు చేయాలని అన్నారు. బడ్జెట్లో ఎక్కువ మొత్తం నిధులు ఖమ్మం జిల్లాకు వెళు_న్నాయని చలోక్తిగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ముందు వరసలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్లో 20% నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు.

అనంతరం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ పథకం అమలులో రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకే ఉమ్మడి జిల్లాల సూచనలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు చెప్పారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ.. అన్ని వర్గాల రైతులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధు పథకంతో చేరువయ్యారని, ఈ పథకంలో ఆంక్షలు విధించవద్దని కోరారు.

**రైతులు, ప్రజల అభిప్రాయాల మేరకు విధివిధానాలు**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార మాట్లాడుతూ.. రైతులకు పంటల పెట్టుబడి సాయం కింద రైతుభరోసా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామన్నారు. ఆ హామీ అమలుకు తమ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతుభరోసా అమలుపై విధివిధానాల రూపకల్పన చేస్తామన్నారు. ఇందుకోసమే తమ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి.. ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**అర్హులకే రైతుభరోసా: తుమ్మల**

క్యాబినెట్ సభ కమిటీ సభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిజమైన రైతులకే రైతుభరోసా అందించేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ఆలోచనల మేరకు అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా అందిస్తామన్నారు.

**నిజమైన రైతులను ఆదుకుంటాం:పొంగులేటి**

క్యాబినెట్ సబ్ కమిటీ మరో సభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజమైన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. మరో 8 ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ గొడెం నగేష్ శాసనసభ్యులు అనిల్ జాదవ్, రామారావ్ పటేల్, హరీష్ రావు,వెద్మ బొజ్జు , పెద్దపల్లి ఎంపీ వంశీ,జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

---

### దేశాభివృద్ధికి సాయపడుతున్న....

# విశాఖ స్టీల్ ప్లాంట్

- విజిటర్స్ బుక్‌లో కేంద్ర మంత్రిఆసక్తికర వ్యాఖ్యలు
- నాలుగు గంటలకు పైగా సందర్శన




**టి మీడియా, జూలై 11,విశాఖపట్నం:** అయితే కుమార స్వామి రాకపై ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ కొంత హింట్ ఇవ్వడంతో అనిశ్చితి తొలగింది. కానీ ఏకంగా కేంద్ర ఉక్కు మంత్రినే ప్లాంట్‌లో ఉండడంతో ఏం జరుగుతుందో అన్న చర్చ పెద్ద ఎత్తున జరిగింది. శ్రీనివాస్ వర్మ చెప్పిన దాని ప్రకారం కేంద్ర ఉక్కు మంత్రి పర్యటనలో అద్భుతాలు ఏమీ జరగవని, పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం ప్రధాని అధ్యక్షతన కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్లాంట్ స్థితిగతులను నేరుగా తెలుసుకునేందుకే వస్తున్నామని చెప్పుకొచ్చారు శ్రీనివాస వర్మ. దీంతో నిన్నటికే ఆ అనిశ్చితి తొలగిందిరెండు రోజుల విశాఖ టూర్‌లో భాగంగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి గురువారం ఉదయం స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్‌లోని కోక్ ఓవెన్‌బీ ఈడీ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఎస్ఎంఎస్2, వైర్ రాడ్ మిల్ విభాగాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటకు పైగా ప్లాంట్‌లోనే తిరిగారు. మంత్రి కుమారస్వామి. ఆ తర్వాత అడ్మిన్ బిల్డింగ్‌కు వెళ్లి విశాఖ ఉక్కు సీఎండీ అతుల్ భట్, ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. ప్లాంట్ నమూనాను పూర్తిగా పరిశీలించారు. దాదాపు నాలుగు గంటలకు పైగా స్టీల్ ప్లాంట్ సందర్శనలోనే గడిపారు మంత్రి కుమారస్వామి.ఆ తర్వాత కార్మిక సంఘాల నాయకులతో మంత్రి కుమారస్వామి సమావేశమయ్యారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక నేతలు మంత్రిని కోరారు. అవసరమైతే ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా.. సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. అందరి వినతులు విన్నాక మంత్రి మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశాభివృద్ధికి సాయపడుతున్నదన్న సంగతి అర్థమైందన్నారు. స్టీల్ ప్లాంట్ అధ్యయనం కోసమే తాను వచ్చానన్నారు. ఇక్కడి పరిస్థితిని ప్రధానికి వివరిస్తానని వెల్లడించారు. స్థానికుల సెంటిమెంట్, కార్మికుల జీవనోపాధి తనకు బాగా అర్థమైనదని మంత్రి చెప్పారు. ఈ ప్లాంట్‌ను పరిరక్షించడమే బాధ్యతగా ముందుకు వెళతామన్నారు. ప్రధాని ఆశీస్సులతో స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం పునరుద్ధరించే అవకాశమున్నదని చెప్పారు. అన్నింటికంటే అతి ముఖ్యంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ప్రైవేటీకరిస్తారని మీకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు.కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పర్యటనతో స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సానుకూల పరిస్థితి ఏర్పడిందన్నారు టీడీపీ ఏపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. ఎంపీలు కలిసిన 14 రోజుల్లోనే కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖకు వచ్చారని, అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పిన మంత్రిని ఆర్థిక భారం లేకుండా చూడాలని కోరినట్టు పల్లా తెలిపారు. బ్యాంకర్లు లోన్లు ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములను ఆర్ఐఎన్ఎల్ పేరుపై మార్చాలని, లేదంటే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలనీ, అదీ కుదరకపోతే సెయిల్‌లో విలీనం చేయాలని కోరామన్నారు పల్లా శ్రీనివాసరావు. స్టీల్‌ప్లాంట్‌పై మేనిఫెస్టోలో చెప్పినట్టే జరుగుతుందన్నారు.

---

### ఏపీ ప్రభుత్వం

# పొదుపు మంత్రం

### ఫర్నిచర్ కొనుగోలుపై బ్యాన్



**టి మీడియా, జూలై 11,అమరావతి:**పొదుపు మంత్రం పాటించాలి.. దుబారా ఖర్చులు వద్దు.. ప్రతి రూపాయి ఇంపార్టెంట్.. ఇటు సంక్షేమాన్ని.. అటు అభివృద్ధిని సమపాళ్లలో ప్రజలకు అందించాలి. అందుకే కీలక నిర్ణయాలు తీసుకుంటూ ఏపీ సర్కార్ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక వనరులతో రాష్ట్రాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకువెళ్లడం కత్తి మీద సాము. అయితే సీఎంగా సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబు.. తన ఎక్స్‌పీరియన్స్ ఉపయోగించి.. స్మార్ట్‌గా ముందుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా దుబారాపై దృష్టి సారించింది ప్రభుత్వం. పొదుపు చర్యల్లో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఫర్నిచర్ కొనుగోలుపై నిషేధం విధించింది. ప్రభుత్వం మారగానే చాలామంది అధికారులు ఫర్నిచర్ కొనుగోలు చేయాలని డిసైడ్ అయ్యారు.

చైర్లు, సోఫాలు, కంప్యూటర్ టేబుళ్లు కావాలని అర్జీలు పెట్టుకున్నారు. అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. ఈ క్రమంలో ఖర్చు దండగ అని భావించిన ప్రభుత్వం.. ఆఫీసుల్లో ఫర్నిచర్ కొనుగోలును నిషేధించింది. 2026, మే 31 వరకు ఈ నిషేధం కొనసాగుతుందని.. అన్ని శాఖల అధికారులకు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. సచివాలయం, కలెక్టరేట్లు, హెచ్ఓడీ ఆఫీసుల్లో ఫర్నిచర్ కొనుగోలు చేయొద్దన్నది ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లో సారాంశం. అయితే ప్రభుత్వ ఆస్పత్రులు, రెసిడెన్షియల్ స్కూళ్లు, రాజ్‌భవన్, హైకోర్ట్‌లకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. కొత్త ప్రభుత్వానికి ఏడాది రెండేళ్ల వరకు ఆర్థికంగా ఒడిదుడుకులు తప్పవని తెలుస్తోంది. సంపద సృష్టి అన్నది ఓవర్ నైట్‌లో సాధ్యమయ్యే పని కాదు. వాటి ఫలితాలు రావడానికి వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఆర్థికంగా ముందుకెళ్లడం అంత ఈజీగా కనిపించడం లేదు. ప్రస్తుతానికి ఫర్నిచర్ కొనుగోళ్లపైన మాత్రమే నిషేధం విధించారు. ముందు ముందు పొదుపు మంత్రంలో ఇంకెన్ని చేరుస్తారో చూడాలి.

---

# వైసీపీ చెప్పేవన్నీ అబద్ధాలే..

### -విశాఖ స్టీల్ ప్లాంట్ పై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**టి మీడియా, జూలై 11,పోలవరం:**ఉత్తరాంధ్ర ప్రజలు భారీ ఎన్డీయే కూటమిని మెజారిటీతో గెలిపించారన్నారు సీఎం చంద్రబాబు. రాజకీయాల్లో విర్రవీగిన వారికి ప్రజలు తగిన శిక్ష వేశారని చురకలు అంటించారు. రాష్ట్రం నిలదొక్కుకోవడానికి తమ బాధ్యత తాము నిర్వహిస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్?లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి ఉత్తరాంధ్రలో పర్యటించారు సీఎం చంద్రబాబు. పోలవరం ఎడమకాలువ పనులను పరిశీలించడంతో పాటూ భోగాపురం ఎయిర్ పోర్టు పనులపై ఆధికారులను అడిగి తెలుసుకోనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వమే కాకుండా ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. విశాఖ స్టీల్స్ ప్రైవేటీకరణను తాను ఒప్పుకున్నామని చెబుతున్నారు.. అవన్నీ అబద్ధాలని అన్నారు సీఎం చంద్రబాబు. గతంలో వాజపేయి హయాంలోనే ప్రైవేటీకరణ చేస్తాన్నప్పుడు అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఈ సారి విశాఖ ప్రైవేటీకరణ జరగకుండా కాపడుతామన్నారు.ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు 5 ఏళ్ల క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడు అలానే ఉన్నాయని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు జరగలేదని చంద్రబాబు విమర్శించారు. టీడీపీ హాయాంలో పోలవరం పనులు 72 శాతం పూర్తి చేస్తే.. జగన్ ప్రభుత్వం డయాఫ్రమ్ వాల్‌ని గోదావరిలో కలిపేసిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్, కాపర్ డ్యామ్స్ దెబ్బతిన్నాయని విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తి కావడానికి సమయం పడుతుందని.. అనకాపల్లి ప్రాంత రైతుల కోసం పురుషోత్తపట్నం లిఫ్ట్ పనులను వేగంగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

---

# రెవెన్యూ అధికారుల తడాకా

- బెడిసికొట్టిన రైతు బంధు ధమాకా.
- వ్యవసాయం ముసుగులో అక్రమ లే అవుట్లు




**టి మీడియా, జూలై 11,ఘట్‌కేసర్ :** రైతు బంధు స్కీమును తనకు అనుకూలంగా మార్చుకుని అతిపెద్ద స్కామ్‌కు పాల్పడ్డాడు ఒక భూ యాజమాని. వ్యవసాయ భూమిగా ఉన్న పోలాన్ని ఓపెన్ ప్లాట్లుగా మార్చాడు. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ మండలంలో చోటు చేసుకుంది. అయితే అదే క్రమంలో రైతు ముసుగు వేసుకుని తన పొలంలో వ్యవసాయం చేస్తున్నట్లు చూపించి కొంత కాలంగా ప్రభుత్వం అందించే రైతు బంధు పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పటి వరకూ తన 33 ఎకరాల భూమికి సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా రూ. 16లక్షలు పొందినట్లు అధికారులు గుర్తించారు. పంట పండించే భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి ప్రయోజనాలను మోసపూరితంగా క్లెయిమ్ చేసినందుకు ఆ భూ యాజమానికి నోటీసులు జారీ చేసింది. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. తన పంటపొలాలను కొన్ని సంవత్సరాల క్రితం చట్టవిరుద్ధంగా ప్లాట్‌లుగా మార్చాడు. ఆ ఫ్లాట్లకు సర్వే నంబర్లు కేటాయించి క్రయవిక్రయాలు జరిపాడు.ఘట్‌కేసర్ మండలం పోచారం గ్రామానికి చెందిన ఎం.యాదగిరిరెడ్డి 38, 39, 40 సర్వే నంబర్‌లోని 33 ఎకరాలను ప్రైవేటు డెవలపర్ల సహకారంతో అక్రమ లే అవుట్లుగా మార్చాడు. వాటిని ఇప్పటికే చాలా మందికి విక్రయించాడు. తద్వారా ఆర్థికంగా లబ్ధి పొందాడు. ఇలా ప్రైవేట్ వ్యాపారం చేస్తూ డబ్బులు సంపాదిస్తూనే.. ప్రభుత్వం తరఫున ప్రతి ఏడాది వచ్చే రైతు బంధు నిధులను కూడా పొందాడు. దీనిపై రెవెన్యూశాఖ స్పందించి రికవరీ చట్టం కింద కేసు నమోదు చేసి నోటీసులు పంపించింది. గత కొన్నేళ్లుగా వ్యవసాయ భూమిగా వర్తించే దానిని కమర్షియల్ ఓపెన్ లే అవుట్లుగా మార్చి వ్యాపారం చేయడాన్ని తీవ్రంగా పరిగణించింది. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన డబ్బులను తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఆ నోటీసుల్లో ఈ భూమి కేవలం వ్యవసాయానికి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఒకవేళ ప్రభుత్వం ఇచ్చిన నోటీసుల ప్రకారం రికవరీ డబ్బులు చెల్లించకపోతే.. భూములను చట్టవిరుద్ధంగా ప్లాట్లుగా మర్చి విక్రయించిన కేసులో కూడా శిక్షపడే అవకాశం ఉంది. ఇప్పుడు ఆ భూ యాజమాని ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

---

# 23న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..

### -కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని మోదీ సమీక్ష

**టి మీడియా, జూలై 11,ఢిల్లీ:**కేంద్ర బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో మోదీ భేటీ అయ్యారు. సమావేశానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సైతం హాజరయ్యారు. ఈ నెల 23న కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ సాధారణ బడ్జెట్‌లో పరిశ్రమలతో పాటు మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలపై భారీ ఆశలు పెట్టుకున్నారు. పెట్టుబడులను రాబట్టేందుకు కేంద్రం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలని భావిస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మోదీ 3.%ఉ% ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేయనుందని చెప్పారు.పెట్టుబడులు రాబట్టడం ద్వారా వృద్ధిరేటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం వ్యూహం సిద్ధం చేస్తోంది. అయితే, ఏ రంగంలో ఏ స్థాయిలో సంస్కరణలు అవసరమో ఆయా రంగాల నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. 2047 నాటికి మోదీ సర్కార్ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. సాధారణ బడ్జెట్ ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశానికి ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల రంగంలో ప్రత్యేక కృషి అవసరమని భావించారు. ఆర్థికవేత్తలతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు సైతం పేద, మధ్య దిగువ మధ్యతరగతి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను, గృహ రుణాల విషయంలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు ఊరట కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పేదల కోసం కొత్త పథకాన్ని ప్రారంభించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది.

# హెలిపాడ్ ప్రదేశాలను పరిశీలించిన గద్వాల జిల్లా, ఇన్చార్జి వనపర్తి ఎస్పీ శ్రీనివాసరావు





**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన సందర్భంగా సభాస్థలి హెలిపాడ్ ప్రదేశాలను పరిశీలించిన గద్వాల జిల్లా, ఇన్చార్జి వనపర్తి ఎస్పీ శ్రీనివాసరావు , క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా జరిగే రైతు భరోసా కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తెలంగాణ రాష్ట్రం శాసనసభ వ్యవహారాల శాఖ ఐటీ శాఖ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా , తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, శాఖ పర్యాటక, సాంస్కృతిక శాఖ పురవస్తు శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు , తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ శ్రీ చిన్నారెడ్డి ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు హాజరు కానున్నారు, వనపర్తి జిల్లాలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు సంబంధించిన దాదాపు 250 మంది రైతులతో రైతు భరోసా పథకం పై అభిప్రాయ సేకరణ కార్యక్రమం సభ వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు నిర్వహిస్తున్న సందర్భంగా ఏర్పాట్లను గద్వాల జిల్లా ఎస్పీ ఇన్చార్జి వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీనివాస , అడిషనల్ ఎస్పి రామదాసు తేజావత్, డి సి ఆర్ బి డి ఎస్ పి కృష్ణ కిషోర్, వనపర్తి డిఎస్పి జె వెంకటేశ్వరరావు , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ముని, టౌన్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, ఎస్సైలు హెలిప్యాడ్, వి ఐ పి పార్కింగ్, ట్రాఫిక్ రూట్లు సభా స్థలికి వచ్చి వెళ్లే దారులు, జనరల్ పార్కింగ్ ప్రదేశాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఆనంతరం బందోబస్తు పరంగా చేయవలసిన ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పి రామదాసు తేజావత్ , డి సి ఆర్ బి డి ఎస్ పి కృష్ణ కిషోర్ ,వనపర్తి డిఎస్పి జె వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ముని, టౌన్ ఇన్స్పెక్టర్ నాగభూషణం ఎస్సైలు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు .

# ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



**టీ మీడియా,జులై 11,గోదావరిఖని ప్రతినిధి:** తెలంగాణలో సింగరేణికి బొగ్గు గనులు ఇవ్వకుండా వేలం వేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎలా గౌడ్ పేర్కొన్నారు. సింగరేణి ఆర్ జీవన్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు చేరుకున్న సందర్భంగా గురువారం ఈ సందర్భంగా కవ్వంపల్లి స్వామి, మడ్డి ఎలాగౌడ్ మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ తెలంగాణలో ఉన్న అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ 130 సంవత్సరాలు చరిత్ర కలిగిన అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ కు కేంద్ర ప్రభుత్వం ఎం ఎం డి ఆర్ 1957 చట్టాన్ని 2017లో మార్పు చేసి నూతన బొగ్గు బ్లాకులను ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని వారు ఆరోపించారు. తద్వారా తెలంగాణలో ఉన్న ప్రజలకు, కార్మికులకు, కర్షకులకు తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు. లక్షలాది కుటుంబాలకు బతుకు తెరువు నీడ కల్పించిన సింగరేణికి కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటుకు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో సింగరేణి కాలరీస్ కనుమరుగ అయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒరిస్సా, ఛత్తీస్గడ్, గుజరాత్ రాష్ట్రాలకు వేలం లేకుండా నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించి తెలంగాణలో ఉన్న సింగరేణికి ఇవ్వకుండా అన్యాయం చేశారని వారు విమర్శించారు. సింగరేణి కాలరీస్ భవిష్యత్తులో కొనసాగాలంటే పార్లమెంటులో ఎంపీలు తమ గళాన్ని విప్పి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గనులు కేటాయించే వరకు ఉద్యమించాలని ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సబ్సీడీ ధరలకే బియ్యం, కంది పప్పు

## -తొలి స్టాల్ ను ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

**టి మీడియా, జూలై 11,విజయవాడ** :నిత్యావసర సరకులను రాయితీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు రైతు బజార్లలో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్లో తొలి కౌంటర్‌ను నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పౌరసరఫరాలశాఖ, కృష్ణా జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో సామాన్యులకు నిత్యావసర సరకులను రాయితీపై అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ప్రజల కష్టాలు తీర్చేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హోల్ సేల్ దుకాణదారులు, రిటైల్ వర్తకులు సైతం 160 రూపాయలకే నాణ్యమైన కిలో కందిపప్పు, తక్కువ ధరకే బియ్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో పంచదార సహా పలు చిరుధాన్యాలనూ రైతు బజార్ల ద్వారా రాయితీపై పంపిణీ చేస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం చొప్పున అందిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.



### రేషన్ బియ్యం స్కామ్ లో అయిదుగురు ఐపిఎస్ లు

రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉందని నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశామని తెలిపారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఇవ్వాల్సిన రూ.600 కోట్లు త్వరలో చెల్లిస్తామన్నారు. ధరల స్థిరీకరణపై రిటైల్ వర్తకులతో మంత్రి సమీక్షించారు.

### బందరులో ప్రారంభించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం లోని రైతుబజారులో కందిపప్పు, బియ్యం స్టాల్ ను మంత్రి కొల్లు రవీంద్రగురువారం ప్రారంభించారు. సబ్సిడీ ధరలకు రైతు బజారులో బియ్యం, కందిపప్పును ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు రైతుబజార్లలో రాయితీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు.

# ఎందుకు ఆ లోక్‌సభ స్థానాలు గెలుచుకోలేక పోయాం ?

## -కురియన్ కమిటీ పోస్టుమార్టం

**టి మీడియా, జూలై 11,హైదరాబాద్:** పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై కురియన్ కమిటీ పోస్టుమార్టం మొదలైంది. రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలుండగా కాంగ్రెస్ 8, బీజేపీ 8 చోట్ల విజయం సాధించాయి. హైదరాబాద్ స్థానాన్ని ఎంఐఎం నిలబెట్టుకుంది. పార్లమెంటు ఫలితాల్లో ఓటమికి కారణాలను తెలుసుకునేందుకు రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ కురియన్ నేతృత్వంలోని వేసిన త్రిసభ్య కమిటీ నేడు గాంధీ భవన్ లో చేరుకున్న కమిటీ నియోజకవర్గాల వారీగా విడివిడిగా అభ్యర్థులతో ఓటమికి గల కారణాలపై ఆరా తీస్తోంది. కురియన్‌తో పాటు రకీబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మూడు రోజుల పాటు వరుస భేటీలు ఉండనున్నాయి. ముందుగా సికింద్రాబాద్ సెగ్మెంట్ లో ఓటమికి గల కారణాలపై కమిటీ ఆరా తీసింది. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఈ కమిటీతో భేటీ అయ్యారు. తర్వాత హైదరాబాద్ పార్లమెంటు అభ్యర్థి సమీర్ ఉల్లాతో కురియన్ నేతృత్వంలోని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ మాట్లాడింది. మల్కాజ్ గిరి, చేవెళ్లలో ఓటమికి కారణాలపై అభ్యర్థులు సునీతా మహేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డిని అడిగి తెలుసుకుంది. వరంగల్ ఎంపీ కడియం కావ్యతోనూ కమిటీ మాట్లాడింది. విజయానికి దోహదపడ్డ అంశాలపై ఆమెతో చర్చించింది. ఇక మెదక్, మహబూబ్ నగర్ అభ్యర్థులు నీలం మధు, వంశీచంద్ రెడ్డితోనూ కమిటీ మాట్లాడనుంది.



**ఇది శుభపరిణామం: దానం**

గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం మంచి ప రి ణా మ ం మ ని సి కిం ద్రా బా ద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాజకీయ పార్టీలో కూడా ఇలాంటి పద్ధతి లేదని, ఇది కొత్త విధానమని అన్నారు. జరిగిన లోపాలు సరిదిద్దు కోవడానికి మంచి అవకాశమని చెప్పారు. తన ఓటమికి కొన్ని పొరపాట్లు జరిగాయని, వాటిని కురియన్ కమిటీకి తెలియజేశానని అన్నారు.

**అసెంబ్లీ సెగ్మెంట్లు రిపోర్ట్ ఇచ్చాను: కావ్య**

కురియన్ కమిటీ గెలిచిన, ఓడిన అభ్యర్థులతో సమావేశమైందని వరంగల్ ఎంపీ కడియం కావ్య చెప్పారు. పలుచోట్ల ఓటమికి కారణాలు అడగారన్నారు.. బీఆర్ఎస్ ఓటు బీజేపీకి టర్న్ అయ్యిందనట్లు చెప్పానన్నారు. తాను లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నివేదిక ఇచ్చానని తెలిపారు. పార్టీ బలహీనంగా ఉన్నచోట ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని కురియన్ అడిగారని అన్నారు.

# చినుకు పడితే చిత్తడే.. వాహనదారుల అవస్థలు

## రహదారి ప్రయాణం... ప్రమాద భరితం..



**టీ మీడియా, జూలై 11, మ వ శో న ం ది :** మ వ శో న ం ది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని మహాదేవపురం వెళ్లే రస్తాయందు చిన్నపాటి వర్షం కురిసిన రోడ్డు యందు వర్షపునీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు వరుసగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతినిత్యం ఈ రహదారి నందు రాకపోకలు సాగించేటప్పుడు, అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. చినుకు పడితే బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా వృద్ధులు, విద్యార్థులు ప్రయాణం సాగించాలంటే నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి బురదమయంగా తయారు కావడంతో, ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు విసుగెత్తిపోతున్నారుఅధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా, ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**పెద్ద మందడి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వీణ**



**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వంటి వ్యాధులు సంభవిస్తాయి. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోకపోవడం వల్ల దోమలు రాకుండా నివారించుకోవాలని పెద్దమందడి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వీణ తెలిపారు. నిలువ నీటిలో దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. నిలువ ఉన్న నీటి తొట్టెలను పరిశుభ్రంగా పెట్టుకోవాలి. దోమ తెరలు వాడాలి, ఇంట్లో కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్నపిల్లలు, వయోవృద్ధులకు వేడి చేసి నీళ్లు ఇవ్వడం మంచిది ఫీవర్ రెండు మూడు నాలుగు రోజులు వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేసుకోవాలి. ఊర్లో ఆశా వర్కర్లకు ఏఎన్ఎం కి తెలియజేయాలి. ముఖ్యంగా పరిశుభ్రంగా ఉంచుకునే భద్రత మన అందరిదీ కాబట్టి అందరూ పరిశుభ్రతను ఉంచుకోవాలి. ఈ సీజన్ ముఖ్యంగా డెంగ్యూ యొక్క లక్షణాలు ఫీవర్, చలి, వాంతింగ్ ,మోషన్స్ ఉంటాయి. కొన్నిసార్లు మోషన్స్ లో బ్లడ్ పడే అవకాశం ఉంటుంది. బ్లడ్ పడడం వల్ల ప్లేటెలేట్స్ పడిపోవడం అని అర్థం. పేలే లెట్స్ పోకుండా ఉండాలంటే దానిమ్మ పండు, బొప్పాయి పండు తినడం వల్ల ప్లేట్ లెట్స్ పెరుగుతాయి. సకాలంలో ఆరోగ్యం గా కాబట్టి 24 అవర్స్ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటుంది. అని డాక్టర్ వీణ సీజన్ వ్యాధుల పట్ల పరిశుభ్రతను పాటించాలని డాక్టర్ వీణ తెలిపారు.

# జనం గుండెల్లో నిలిచేవారే నిజమైన నాయకులు

**సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**



**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** ప్రజా సేవలో జనానికి అండగా నిలిచిన వారే నిజమైన నాయకులని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన గుండ్రాతి వామన్ గౌడ్ ను సాహితీ కళా వేదిక పక్షాన గురువారం వనపర్తిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించిన వారిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పదికాలాలపాటు జనం మదిలో నిలిచి ఉంటారని అలాంటి వారిలో వామన్ గౌడ్ ఒకరని శంకర్ గౌడ్ అన్నారు. ఆయన తన పదవీ కాలంలో బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ఆయన అన్ని వర్గాల ప్రజలకు అన్ని వేళల బాసటగా నిలిచారని వివరించారు. కళా వేదిక సభ్యులు ఆయనను శాలువా పూలమాల జ్ఞాపికలతో సత్కరించారు. ఈనాటి కార్యక్రమంలో బైరోజు చంద్ర శేఖర్,కంటే నిరంజనయ్య, రంగయ్య గౌడ్,నాయకంటి నరసింహ శర్మ,గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్,స్వామి,బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి బిజెపి కార్యకర్త అమ్మ పేరుతో మొక్కలు నాటాలి



**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బిజెపి వనపర్తి పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి సుగురు రాములు ఆధ్వర్యంలో నాలుగో వార్డ్ కుమ్మరి వీధి బూత్ నంబర్ 145 హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఏక్ పేడ్ మా కె నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ భూభాగంలో 33% పచ్చదనం ఉంటేనే వాతావరణం సమతుల్యం అవుతుందని పెరుగుతున్న జనాభా పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో అడవులు తరిగిపోతున్నాయని దీనివల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ వర్షపాతం తగ్గుతున్న పక్షంలో మానవ జీవితమే అల్లకల్లోలం అయ్యే పరిస్థితి ఏర్పడే ప్రమాదం రాకుండా ఉండాలంటే ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందరూ మీ ఆలోచనలకు అనుగుణంగా మీకు నచ్చిన ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగం సురేందర్, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము, ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి రాయన్న, ఐటీ సెల్ కన్వీనర్ విజయ్ సాగర్, పట్టణ నాయకులు సూర్యవంశం శీను, మురార్జీ నాయక్, మల్లికార్జున్, శేఖర్, విజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మికులు ఉన్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి


**ఎజిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్**



**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు ఉన్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్, పోక్సో కేసులపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1 నుండి 31 వరకు జరిగే ఆపరేషన్ ముస్కాన్ బృందాల ద్వారా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. హోటళ్ళు, కిరానం షాపులు, ఇటుక భట్టి, పత్తి చేలల్లో ఎక్కడైనా బడి ఈడు పిల్లలు పని చేస్తూ ఉంటే రెస్క్యూ చేయాలని సూచించారు. పిల్లల చేత ఎక్కడైనా వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు తెలిస్తే కేసులు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెస్క్యూ చేసిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను విద్యా సంస్థలలో చేర్పించాలని సూచించారు. చైల్డ్ కేర్ సెంటర్లలో దోమలు వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోక్సో కేసుల పై చర్చిస్తూ బాధితులకు నిబంధనల ప్రకారం అందాల్సిన పరిహారం సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మిబాయి, విద్యా శాఖ నుండి ఏ .డి. నరహరి, హెల్త్ నుండి పరిమళ, ఆర్.డి ఎస్ స్వచ్ఛంద సంస్థ నుండి చిన్నమ్మ థామస్, డీసీపీఓ రాంబాబు, సి.డబ్ల్యూ.సి. మెంబర్ వనజ కుమారి, పోలీస్ శాఖ నుండి రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది మామూలు రిటైర్‌మెంట్ ఫంక్షన్ కాదు

## -అన్నదాతలకు అరుదైన గౌరవం..!



**టి మీడియా, జూలై 11,కొయ్యలగూడెం:** సహజంగా ప్రభుత్వ ఉద్యోగస్థుల పదవీ విరమణ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు ఘనంగా నిర్వహించడం పరిపాటి. ఎన్నో సంవత్సరాలు ప్రభుత్వ సంస్థలో పనిచేస్తూ వృద్ధాప్యంలో రిటైర్‌మెంట్ తీసుకున్న తర్వాత తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఉద్యోగస్థులు భావిస్తారు. అయితే అలాంటి రిటైర్‌మెంట్ కార్యక్రమమే తిపి గుర్తుగా ఉండిపోయేలా ఏలూరు జిల్లాలో జరిగింది. కానీ వారు ఇటువంటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్థులు మాత్రం కాదు. ఇంతకీ ఆ రిటైర్‌మెంట్ ఫంక్షన్ ఎవరికి చేశారు. ఎందుకు చేశారు. అంత ప్రత్యేకంగా రిటైర్‌మెంట్ ఫంక్షన్ చేయడం వెనుక ఉన్న కారణాలు ఏంటి అనేగా మీ డౌట్.. ఇప్పుడు ఈ స్టోరీలో ఆ వివరాలు తెలుసుకుందాం..ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం గవరవరంలో ఇప్పటివరకు ఎక్కడ వినని, జరగని రిటైర్‌మెంట్ ఫంక్షన్ రైతులకు నిర్వహించారు. కాస్త ఈ కార్యక్రమం గురించి వినటానికి ఆశ్చర్యంగానే ఉన్న దాని ఉద్దేశం వెనక ఆంతర్యం తెలిసిన పలువురు వారిని అభినందనలతో ముంచెత్తుతున్నారు. గవరవరం గ్రామానికి చెందిన కొంతమంది సీనియర్ రైతులకు సామూహిక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా తమ అనుభవంతో కష్ట నష్టాలు ఎదుర్కొని ప్రకృతితో మమేకమై ఆరుగాలం కష్టించి పంటలు పండించి అందరికీ అన్నదాతలుగా నిలిచిన రైతులకు రిటైర్‌మెంట్ ఫంక్షన్ చేయాలని స్థానికులు ఆలోచన చేశారు. అందుకోసం గ్రామంలో 70 సంవత్సరాలు పైబడి 90 సంవత్సరాలు లోపు ఉన్న వృద్ధులకు రిటైర్‌మెంట్ ఫంక్షన్‌లో భాగంగా వారిని ఘనంగా సత్కరించాలనుకున్నారు. ఈ క్రమంలో వారందరినీ ఒకే వేదిక వద్దకు చేర్చి మండల వ్యవసాయ అధికారులు సమక్షంలో వారికి ఘనంగా సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారిని గౌరవంగా శాలువాలు కప్పి, పూల దండలు వేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారి అనుభవాలు రాబోయే తరాలకు మార్గదర్శకాలు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసిన వారిని సైతం పలువురు అభినందిస్తున్నారు.

# మంచి మనసు లేని ప్రతి ఒక్కరు అంగవైకల్యులే

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** మనిషికి అంగవైకల్యం అనేది శాపం కాదని, మంచి మనసు లేని ప్రతి ఒక్క వ్యక్తి అంగవైకల్యుడేనని, అంగవైకల్యం ఉందని ఎప్పుడు కూడా అదేర్య పడవద్దని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని వికలాంగుల పునరావాస కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వికలాంగుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, డి ఆర్ డి ఓ అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ డి ఎల్ యంత్రాన్ని ప్రారంభించిన ఆర్జీవన్ జీఎం



**టీ మీడియా, జులై11, గోదావరిఖని ప్రతినిధి:** ఆర్ జీవన్, త్రి ఇన్క్లైన్ లో నూతన ఎస్ డి ఎల్ యంత్రాన్ని ఆర్జీవన్ జీఎం చింతల శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధికారులు, యూనియన్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్డిఎల్ యంత్రానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించే భూగర్భ గనిలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ గతంలో ఉన్న జీడీకే 1, 3 ఇంక్లైన్లోని యంత్రాలు జీవిత కాలం ముగియడంతో నూతన ఎస్ డి ఎల్ యంత్రాన్ని సుమారు 45 లక్షల రూపాయల తో కొనుగోలు చేసి ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ ఎస్ డి ఎల్ యంత్రంల వలన భవిష్యత్తులో నిర్దేశిత లక్ష్యాలను రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత ఏ ఆటంకం లేకుండా సజావుగా సాగాలని, ఈ యంత్రాల ద్వారా రక్షణకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఉత్పత్తి లక్ష్యాలు అధికమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వెంకటేశ్వరరావు, సివిల్ డీజీఎం వరప్రసాదు, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, కానీ మేనేజర్ రమేష్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**టీ మీడియా,జులై 11,గోదావరిఖని ప్రతినిధి:** రామగుండం కార్పొరేషన్ పరిధి 33 వ డివిజన్ మార్గదర్శి విద్య విహార్ లో గురువారం కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సత్యం నగర్ బస్తీవాసులు గత 30 సంవత్సరాల పాత విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఇబ్బందులు పడుతున్నారని, తెలుసుకొని వెంటనే విద్యుత్ అధికారులకు తో మాట్లాడి సంప్రదింపులు జరిపి పరిష్కార దిశగా చర్యలు చేపట్టి కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించినటువంటి ఏఈ హరీష్, ఎస్ ఎల్ ఐ వెంకటరాజు, ఎల్.ఎం రఘుపతి రెడ్డి, విద్యుత్ సిబ్బందికి డివిజన్లోని బస్తీ వాసుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

# 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



**టి మీడియా, జూలై 11,హైదరాబాద్ :** ఈనెల 24 నుంచి తెలం గాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగను న్నాయి. అసెంబ్లీ నిర్వ హణపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖాధి కారులతోఈరోజు సమీక్షిం చారు. సీఎస్, డీజీపీ ఇతర ఉన్న తాధికారులు హాజరయ్యా రు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై స్పీకర్, మండలి ఛైర్మన్ పలు సూచనలు చేశారు. సమావేశాలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికా రులను ఆదేశించారు. కేంద్రంలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరువాతనే రాష్ట్రంలో బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సి ఉండడంతో అందుకు తగ్గట్లు అధికారు లు సిద్ధం కావాలని సూచించార్న.

# ఫీజుల గోడు తీరేది ఎప్పుడు

## ఎస్కాలర్షిప్ లపై చలో కలెక్టరేట్

### నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నేతలు




**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేసి, విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా చలో కలెక్టరేట్ కు భారీగా విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ముట్టడి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా అధ్యక్ష,కార్యదర్శి రాఘవ,ఎం.ఆది మాట్లాడుతూ కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్య అంధకారంలో ఉందని మొదట పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులపై చిన్న చూపు చూసింది. పేద విద్యార్థులు అందులోనూ ఎస్సీ,ఎస్టీ, బీసీ సామాజికంగా వెనకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత చదువులు ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి చదువుతున్నారు. గత ఆరేళ్ళ నుండి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.వీరికి సంవత్సరానికి మూడు వేల కోట్లు అవసరం అవుతాయి. కానీ గత ఆరు సంవత్సరాల నుంచి మొత్తం 8,214 కోట్ల రూపాయల ఫీజు బకాయిలు ఉన్నాయని ప్రభుత్వం విద్యార్థులు ఆందోళన చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుండి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం,పాలకులు మారిన విద్యార్థుల జీవితాలు మారడం లేదని విమర్శించారు. తక్షనమే పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసి కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని,లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేక రోడ్లపైకి విద్యార్థులు వచ్చి ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, పెద్దమందడి బీసీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకుంది. తక్షణమే హాస్టల్ ఏర్పాటు చేయాలని, వనపర్తి జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్ కు స్థలం, బడ్జెట్ ఉన్న పనులు ప్రారంభించకపోవడం ఏంటని ప్రశ్నించారు. నూతనంగా ఏర్పడ్డ చిన్నంబావి, అమరచింత, మదనపురం,రేవల్లి మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి, ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ సంచిత్ గంగ్వార్ కి ఇవ్వడం జరిగింది.ఈ చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, అనిల్,జిల్లా కమిటీ సభ్యులు సాయి, రమేష్, నీలోత్పల్, వెంకటేష్ ,పూజ ,శ్వేత, రాజ వర్ధన్, లక్ష్మణ్, రాజేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడంతో పాటు పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను పసిపిల్లాడిలా కాపాడుకోవాలని, లక్షల సంఖ్యలో మొక్కలు నాటడంపై పెట్టిన దృష్టిని వాటిని సంరక్షించే చర్యలపై దృష్టి సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు.గురువారం వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామ శివారులోనే ఫారెస్ట్ స్థలంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెట్లను పెంచడం ద్వారా పుష్కలంగా ప్రాణవాయువు లభించడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, ప్రతి ఒక్కరు పుట్టినరోజులకు పెళ్లిరోజులకు పండగ రోజులలో ఇండ్ల వద్ద పంట పొలాల్లో వీలున్నప్పుడల్లా మొక్కలు నాటి వాటిని పెంచాలని ఆయన సూచించారు.అధికారులు వారం వారం మొక్కల సంరక్షణపై రివ్యూ సమావేశం నిర్వహించి మొక్కల పెంపకానికి కావలసిన తగు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రకృతిని మనం కాపాడితే అది మనను మన భవిష్యత్తు తరాలను కాపాడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ సవాయి గూడెం గ్రామ ప్రత్యేకాధికారి నితిష్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మిస్టర్ తెలంగాణ మృతి



**టి మీడియా, జూలై 11,సిద్దిపేట:**తెలంగాణలో విషాదం నెలకుంది. మిస్టర్ తెలంగాణ టైటిల్ విజేత, మోడల్, ప్రముఖ బాడీబిల్డర్ మహ్మద్ సోహైల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు విడిచాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న క్రాష్ ఆటోని ఢీకొంది. సోహైల్ అతని మిత్రుడు మహ్మద్ ఖదీర్తో కలిసి జూన్ 29న సిద్దిపేట నుంచి మిరిదొడ్డి వైపునకు వెళ్తుండగా ఈ యాక్సిడెంట్ జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సోహైల్ను వెంటనే స్థానికంగా ఉన్న హాస్పిటల్కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోహైల్ కన్నుమూశాడు.

సోహైల్ స్వస్థలం సిద్దిపేట. తెలంగాణలోని పేరున్న బాడీ బిల్డర్లలో అతడి పేరు ముందు వరసలో ఉండేది. 23 ఏళ్ల వయస్సులోనే బాడీ బిల్డర్గా సోహైల్ పలు ఛాంపియన్ షిప్లు గెల్చుకున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్లలో పాల్గొని విజేతగా నిలిచాడు. సోహైల్ చనిపోవడంతో.. సిద్దిపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. పిన్న వయస్సులో సోహైల్ మరణాన్ని అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. బాడీబిల్డింగ్లో మంచి భవిష్యత్తు ఉన్న తన ప్రియమైన స్నేహితుడిని కోల్పోయినందుకు అతని స్నేహితుడు అఫ్రిది విచారం వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసుకున్న మిరుదొడ్డి పోలీసులు అతివేగమే ప్రమాదానికి కారణమని తెలిపారు.



# ఆర్డీవో కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

**-దగ్ధమైన విలువైన భూసేకరణ పత్రాలు**

**టి మీడియా, జూలై 11,జయశంకర్ భూపాలపల్లి :**జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో బీరువాలో భద్రపరిచిన విలువైన సుమారు (15 ఫైల్స్) భూసేకరణ పత్రాలు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి జరిగిన ఘటనపై గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.దగ్ధమైన పత్రాల్లో కాలేశ్వరం మేడిగడ్డ, సింగరేణి, కేటీపీపీలో భూములకు చెల్లించే విలువైన ఫైల్స్ వున్నాయి. అధికారులు మాత్రం సాఫ్ట్ కాఫీలు సిష్టం, ఆన్ లైన్ లో భద్రంగా ఉన్నట్లు తెలిపారు. అయితే ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా..? లేదా ఎవరైనా కావాలని చేశారా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.



# వైసిపి పాలనలో అంతా దోపిడినే

**-ఆడవులను చెరబట్టి మొత్తం ఊడ్చేశారు**

**-శ్రీవారి ఆస్తులను వదలలేదు**

**-తిరుమలలో మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్**

**టి మీడియా, జూలై 11,తిరుమల:** ఏపీలో గత వైసిపి ప్రభుత్వ పాలకులు వీరప్పన్ వారసులని, ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను దోచుకున్నారని మండిపడ్డారు కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. తిరుమలలో శ్రీవారిని నేటి ఉదయం ఆయన దర్శించుకున్నారు.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, . ఆ డబ్బుతో రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకున్నారన్నారు..ఈ ఎర్రచందనం దొంగలను వదిలిపెట్టేదే లేదని తేల్చి చెప్పారు. శేషాచలం కొండల్లో ఎర్రచందనం దోపిడీపై నివేదిక కోరతామని. దాని ఆధారంగా జాతీయ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై గతంలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తిరుపతి బిజెపి నాయకులు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు..

**పంగనామాల నయవంచకులు పోయారు..**

శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచకులు పోయారని బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు స్వామివారికి నిత్యం సేవ చేసే రాజ్యం వచ్చిందని చెప్పారు. గత అరాచక ప్రభుత్వంలో స్వామివారి నిధులను పక్కదారి పట్టించి తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారంటూ ఆరోపించారు. కొండ మీద అరాచక పాలన ముగిసిందన్నారు. ఇన్నాళ్లు భక్తులు ఎదుర్కొన్న సమస్యలు తొలగి పరిస్థితులు చక్కబడ్డాడని చెప్పారు. స్వామివారి ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.. ప్రధాని . నరేంద్ర మోదీ దేశాన్ని విశ్వగురువుగా చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన సారథ్యంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతోంది అని బండి సంజయ్ అన్నారు.

# ఒకరు ప్రేమంటూ.. మరొకరు పెళ్లంటూ..

**- టార్చర్ భరించలేక యువతి ఆత్మహత్య.**



**టి మీడియా, జూలై 11నల్లగొండ :**నిర్భయ లాంటి ఎన్ని చట్టాలు ఉన్నా.. ఎన్ని శిక్షలు విధించినా.. ప్రేమోన్మాదులు మాత్రం ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. తాజాగా.. నల్లగొండ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది.. ఒకే వీధిలో ఉండే ఇద్దరు యువకులు.. ఓ యువతి దారుణంగా హింసించారు.. పెళ్లి చేసుకోవాలని ఒకరు, ప్రేమించాలని మరొకరు వేధించారు. తాము చెప్పినట్లుగా వినకపోతే వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్ లలో ఫొటోలను పెడతామని బెదిరించారు. దీంతో ప్రేమోన్మాదుల వేధింపులు తాళలేక చివరకు ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది.నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన కొత్త రామలింగం రజిత దంపతులకు కుమారుడు, కుమార్తె కల్యాణి(18) ఉన్నారు. కల్యాణి పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్ ప్రైవేట్ ఉద్యోగం చేసింది. కొంతకాలంగా ఆమె ఇంటి వద్దే ఉంటోంది. ఒకే గ్రామానికి చెందిన ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులు స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఒకే ఊరు వారు కావడంతో ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులతో కళ్యాణికి పరిచయం ఉంది. అయితే శివ, కొమ్మనబోయిన మధులు కల్యాణిని ఇష్టపడుతున్నారు. వీరిద్దరూ కొద్దిరోజుల కిందట కల్యాణి ఫోన్ నెంబర్ ను తెలుసుకొని ఆమెకు తరచూ ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఒకే ఊరు కావడంతో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకుని తనను ప్రేమించాలని శివ, తనను పెళ్లి చేసుకోవాలని మధులు అడుగుతున్నారు. వీరిద్దరి ప్రేమ, పెళ్లి విషయాన్ని కళ్యాణి నిరాకరించింది. వారితో మాట్లాడడం కూడా బంద్ చేసింది. దీంతో శివ మధులిద్దరూ.. వాట్సాప్ లో ఆమె డీపీగా (డిస్ప్లే పిక్చర్) పెట్టుకున్న ఫొటోలను తీసుకుని వాటిని తమ వాట్సాప్, ఇన్స్టాగ్రామ్లో.. స్టేటస్ గా పెట్టుకుంటామని బెదిరించారు. చెప్పినట్లు వినాలంటూ పదే పదే టార్చర్ పెట్టడంతో ఇద్దరు యువకులు వేధింపులు తాళలేక కల్యాణి ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు కళ్యాణి మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆ తర్వాత నల్లగొండలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ కళ్యాణి మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.తమ కుమార్తె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ గ్రామస్తుల పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తన ఆత్మహత్యకు కారకులు శివ, మధులేనని కల్యాణి జడ్జికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొంది. కళ్యాణి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, నిందితులు శివ, మధులు పరారీలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు.

# పోటీ పడుతున్న ఇద్దరు నేతలు

**-మంత్రుల వద్ద అర్జీలు**



**టి మీడియా, జూలై 11,జగిత్యాల :**ప్రత్యర్థి పార్టీల్లో కొనసాగిన ఆ ఇద్దరు నేతలు ఒకే గూటికి చేరారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిన జగిత్యాల ముఖ్య నేతల తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆధిపత్య పోరులో ఈ ఇద్దరు నేతలు ఎలా వ్యవహరిస్తారోనన్న చర్చ ఓ వైపు సాగుతుండగానే ఆ ఇద్దరు నేతలు మాత్రం తమ ప్రాంత అభివృద్ధి మంత్రాన్ని జపిస్తున్న తీరు సరికొత్త చర్చకు దారి తీసింది. సొంత ఇలాకాలో పట్టు కోసం తమ శ్రేణుల మధ్య వైరాన్ని పెంచి పోషించడం కంటే ఎక్కువగా ప్రజల్లో తమ క్రెడిట్ దక్కించుకునే దిశగా పావులు కదుపుతున్నారు.

**ఎమ్మెల్యే సంజయ్..**

ఇటీవలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న జగిత్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డితో సహ మంత్రులను కలిసి అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గ కేంద్ర సమీపంలోని నూకపల్లిలో నిర్మించిన డబుల్ ఇళ్లలో మౌళిక సదుపాయలను కల్పించేందుకు నిధులు కేటాయించాలని కోరారు డాక్టర్ సంజయ్. ఆయన అభ్యర్థనలను పరిశీలించిన ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ జీఓలను జారీ చేసింది. డబుల్ బెడ్ రూం ఇండ్లతో యావర్ రోడ్డు అభివృద్ధి కోసం కూడా డాక్టర్ సంజయ్ రూ. 25 కోట్లు మంజూరు చేయించినట్టుగా చెప్తున్నారు.

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి..**


మరో వైపున ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా దూకుడు పెంచారు. నియోజకవర్గ అభివృద్దిలో భాగంగా యావర్ రోడ్డుకు రూ. 100 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే నూకపల్లిలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందించేందుకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. జీవన్ రెడ్డి కూడా జగిత్యాలలో తన పట్టు నిలుపుకునేందుకు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ప్రముఖులను కలుస్తుండడం విశేషం.

**అభివృద్ధి మంత్రం..**

జగిత్యాలకు చెందిన ముఖ్య నేతలు ఇద్దరు కూడా ఆధిపత్య పోరులో అభివృద్ధి మంత్రాన్ని జపిస్తున్నారు. నియోజకవర్గంలో తమ పట్టు జారిపోకుండా ఉండాలంటే తామేంటో నిరూపించుకునే ప్రయత్నాల్లో మునిగిపోయారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను కలిశారు. మరికొంత మంది మంత్రులను కూడా కలిసి జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి గురించి నిధులను కేటాయించాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కోరే అవకాశాలు లేకపోలేదు. అయితే ఇద్దరు నేతలు కూడా నూకపల్లిలో నిర్మించిన ఇండ్ల విషయంపైనే ప్రత్యేక దృష్టి సారించారు. తన హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బాగు చేయించి లబ్దిదారులకు ఇవ్వాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరుతుండగా, తాను చొరవ తీసుకుని కట్టించిన నూకపల్లి డబుల్ ఇండ్లకు మౌళిక వసతులు కల్పించి లబ్ది చేకూర్చాలని కోరుతున్నారు ఎమ్మెల్యే సంజయ్. ఏది ఏమైనప్పటికీ ఇద్దరు నేతలు కూడా నూకలపల్లి కేంద్రంగానే తమ క్రెడిట్ దక్కించుకోవాలని తపన పడుతున్నట్టుగా స్పష్టం అవుతోంది. అయితే స్థానికులు మాత్రం ఇద్దరు ముఖ్య నేతలు అభివృద్ధి విషయంలో ఇలాగే పోటీ పడినట్టయితే జగిత్యాల రూపురేఖలే మారిపోతాయని అంటున్నారు.

# త్వరలో హైదరాబాద్ వస్తా

**- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు లేఖ**



**టి మీడియా, జూలై 11,హైదరాబాద్:** జూబ్లీహిల్స్ పోలీసులకు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు లేఖ రాశారు. తాను వాస్తవానికి జూన్ 26వ తేదీన ఇండియాకు రావాల్సి ఉంది కానీ అనారోగ్యం కారణంగా అమెరికాలోనే ఉండిపోయానన్నారు..తాను క్యాన్సర్తో పాటు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నానని లేఖలో పేర్కొన్నారు. అమెరికా వైద్యుల సూచన మేరకు అక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటున్నట్టు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. తనపై పూర్తి అసత్య ఆరోపణలు చేస్తున్నారని.. తాను ఎక్కడా కూడా ఇల్లీగల్ పనులు చేయలేదని ఎస్ఐబీ మాజీ ప్రభాకర్ రావు తెలిపారు.జూన్ 26వ తేదీన ఇండియాకు వచ్చేది ఉండేది.. కానీ నా ఆరోగ్యం బాగా లేకపోవడంతో అమెరికాలో ఉండిపోవాల్సి వచ్చింది. క్యాన్సర్ తో పాటు గుండె సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నాను. అమెరికా వైద్యులు ఇచ్చిన సూచన మేరకు అక్కడే ఉండి చికిత్స చేయించుకుంటున్నాను. ఈ కేసుకు నాకు ఎలాంటి సంబంధం లేదు. పూర్తి అసత్యమైన ఆరోపణలు నాపై చేస్తున్నారు. నేను ఎక్కడ కూడా ఇల్లీగల్ పనులు చేయలేదు. పోలీసులకు ఈ దర్యాప్తులో సహకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నేను ఇండియాకు వచ్చే వరకూ టెలికాన్ఫరెన్స్ లేదా మెయిల్ ద్వారా పూర్తి సమాచారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాను. నేను క్రమశిక్షణ గల ఒక పోలీసు అధికారిని. విచారణను ఎదుర్కొంటాను. ఎక్కడికీ తప్పించుకొని పారిపోయే పరిస్థితి లేదు. నా ఆరోగ్యం కుదుటపడిన తర్వాత నేనే ఇండియాకు వస్తాను. గతంలో కూడా పలుమార్లు ఉన్నతాధికారులకు విషయాన్ని వాట్సప్ కాల్ ద్వారా చెప్పాను. నా దృష్టికి వచ్చిన సమాచారాన్ని మొత్తం కూడా విచారణ అధికారికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను" అని ప్రభాకర్ రావు వెల్లడించారు.



# అడవి పంది దాడిలో బాలుడికి గాయాలు.

**టీ మీడియా, జులై 11,ఓదెల:**పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో, రోడ్డు బయట ఆడుకున్న, బాలుడు పై దాడి చేసింన అడవి పంది, తీవ్ర గాయాలైన బాలుడిని, హుటాహుటిన, కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు, పిట్టల సాత్విక్,12,తండ్రి పేరు,పిట్టలమహేష్, పేద కుటుంబం కావడంతో, దాతలు ముందుకు వచ్చి సహాయం చేయగలరని, బాధితుని తండ్రి,కోరారు.




# ప్రతి కుటుంబ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం..**

**టీ మీడియా, జూలై 11, మహానంది:**దేశ ప్రగతి అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక స్వాలంభణ లక్ష్యాల సాధన మనందరి బాధ్యతని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీహెచ్ ఈవో హుస్సేన్ రెడ్డి అన్నారు. గురువారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ప్రపంచ జనాభా దినోత్సవ కార్యాక్రమాన్ని తిమ్మాపురం ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ ఈవో హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక జనాభా వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు దుర్భరంగా తయారవుతాయని, ఎక్కువ మంది పిల్లలు ఉంటే లాభాల కన్నా నష్టాలే ఎక్కువని తెలియజేశారు. అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధం మేమిద్దరం మాకు ఒక్కరు అని,దేశాభివృద్ధికి కుటుంబ నియంత్రణ పాటిద్దాం బిడ్డకు మధ్య ఎడం పాటిద్దాం అని,జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధం అధిక జనాభా పెరుగుదల నష్టాల గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు



# గురుకుల విద్య సంస్థల్లో అధ్యాపక సిబ్బందిని పెంచాలి

### ఎంపీ డా. మల్లు రవి

**టీ మీడియా, జులై 11, వనపర్తి బ్యూరో :** హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ డి యస్ యస్ భవన్ లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యలయాల సంస్థ కార్యదర్శి కార్యాలయం సెక్రటరీ బి. సైదులు ని కలిసిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎంపీ డా. మల్లు రవి , కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి , బాలాజీ సింగ్ . సెక్రటరీ సైదులుతో కలిసి నాగర్ కర్నూల్ పార్లమెంట్ గురుకుల విద్య సంస్థల్లో అధ్యాపక సిబ్బందిని పెంచాలని కోరారు. ఇప్పుడు వున్నా గురుకుల పాఠశాలలో విద్య నైపుణ్యం పెంచేలా తరగతులు, బీసీ పిల్లలకు ఎక్కువ సీట్స్ అందించాలని కోరారు.

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
T MEDIA
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్మీట్ ఏర్పాటు, ప్రెస్నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి